ఎస్సీ గురుకులాల్లో ప్రమోషన్ల దాటవేత

- 317 జీవో సాకుతో ముందుకు కదలని ఫైలు
- 2018 నుంచి వేలాది మంది ఎదురుచూపు

హైదరాబాద్, మార్చి18 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ఎస్సీ గురుకుల సొసైటీలో ఉద్యోగ, ఉపాధ్యాయ ప్రమోషన్ల ఊసే కానరావడం లేదు. 2018 నుంచి ఎలాంటి మార్పులు లేక వారంతా వెనుకబడి ఉన్నారు. వీరితోపాటే ఎంపికైన బీసీ, మైనార్టీ, జనరల్ గురుకులాల్లో 2021లో ఒకసారి, ఇదే విద్యాసంవత్సరంలో మరోసారి ప్రమోషన్లు కల్పించారు. గిరిజన గురుకులాల ప్రమోషన్ల ప్రక్రియ దాదాపు తుది దశకు చేరుకున్నది. కానీ, తమ ప్రమోషన్ల ఊసే లేకుండా పోయిందని ఎస్సీ గురుకుల సొసైటీ ఉద్యోగులు వాపోతున్నారు. 317 జీవోను సాకుగా చూపుతూ దాటవేస్తున్నారని ఆందోళన చెందుతున్నారు. బీసీ, ఎస్టీ, మైనార్టీ, ఎస్సీ గురుకులాల్లో 2018, 2019లో నియామకాలు జరిగాయి. ఆ బ్యాచ్‌కు చెందిన మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల విద్యాసంస్థల సొసైటీలో ఉద్యోగ, ఉపాధ్యాయులు ఇప్పటికే రెండుసార్లు ప్రమోషన్లను పొందారు. మైనార్టీ గురుకుల సొసైటీలోని ఉద్యోగులకు ఒక దఫా ప్రమోషన్లను కల్పించారు.

ఎస్సీ, ఎస్టీ సొసైటీల్లో కదలని ఫైలు

ఎస్సీ గురుకుల సొసైటీలోనే 250 మంది టీజీటీ, 150 మంది పీజీటీ, 100 మంది జూనియర్ లెక్చరర్లు, 20 మంది డిగ్రీ లెక్చరర్లు ప్రమోషన్లు రాక, హోదాపరంగానూ వెనుకబడిపోతున్నారు. ప్రొబేషనరీ డిక్లేర్ చేసే సమయానికి 317 జీవో వివాదం మొదలైందని దీంతో ప్రమోషన్ల ప్రక్రియ మరింత జఠిలంగా మారింది. 317 జీవోను సవాల్ చేస్తూ అనేక మంది కోర్టుకు వెళ్లారని, ఇప్పుడు ఆ కేసులనే సాకుగా చూపి ప్రమోషన్ల ప్రక్రియనే ఏండ్లుగా నిలిపివేశారని వారంతా వాపోతున్నారు. గురుకులాల జేఏసీ ఆధ్వర్యంలో వందలాది మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు ప్రజాభవన్‌కు, సొసైటీ కార్యాలయాల్లో తమ గోడు వెళ్లబోసుకున్నా నేటికీ ఫలితం దక్కలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఎన్నికల కోడ్ ముగిసే సమయానికి ప్రమోషన్ల కోసం ముందస్తు కసరత్తును పూర్తి చేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

ఎన్నికల్లో పోటీకి 107 మంది అనర్హులు

హైదరాబాద్, మార్చి 18 (నమస్తే తెలంగాణ): ఎన్నికల్లో పోటీ చేసి ఖర్చులు సమర్పించని వారు పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హులైన జాబితాను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. రాష్ట్రంలో 107 మంది ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హులని వెల్లడించింది. అనర్హుల్లో అత్యధికంగా నిజామాబాద్ లోక్‌సభ పార్లమెంట్ పరిధి వారు ఉండటం గమనార్హం. ఈ నియోజకవర్గం నుంచి గతంలో పసుపు బోర్డు కోసం 72 మంది పార్లమెంట్, 35 మంది అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేశారు. ప్రస్తుతం వీరంతా అనర్హులని ఎన్నికల సంఘం ప్రకటించింది. పార్లమెంట్ స్థానాల్లో మెదక్ లోక్‌సభ పరిధిలో హన్మంతరెడ్డి, మహబూబాబాద్ లోక్‌సభ నుంచి కొల్లూరి వెంకటేశ్వర్ రావు, నల్లగొండ నుంచి పోటీ చేసిన కే వెంకటేశ్ ఉన్నారు. అసెంబ్లీలో పోటీ చేసిన వారు వచ్చే ఆగస్టు వరకు, పార్లమెంట్‌కు పోటీ చేసినవారు వచ్చే జూన్ వరకు పోటీ చేయడానికి అనర్హులుగా గుర్తించారు.

ఎన్నికల కోడ్‌తో పోలీస్ బ్యాడ్మింటన్ టోర్నీకి బ్రేక్?

హైదరాబాద్, మార్చి 18 (నమస్తే తెలంగాణ): ఎన్నికల కోడ్ కారణంగా 16వ ఆలిండియా పోలీస్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను తాత్కాలికంగా నిలిపివేసినట్టు విశ్వసనీయ సమాచారం. సోమవారం సాయంత్రం ప్రారంభోత్సవం నిర్వహించాల్సి ఉండగా, అనూహ్యంగా ప్రారంభోత్సవం లేదని డీజీపీ ఆఫీస్ నుంచి అతిథులు, ఆహూతులకు సమాచారం వచ్చింది. గత అక్టోబర్‌లో ఏర్పాట్లు చేస్తుండగా.. అసెంబ్లీ ఎన్నికలు వచ్చేశాయి. తాజాగా పార్లమెంట్ ఎన్నికలు అడ్డు వచ్చాయి. ఇదిలా ఉంటే ఇప్పటికే 29 టీమ్‌లు రాష్ట్రానికి చేరుకోవడంతో అనధికారికంగా పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిసింది.

చంద్రబాబుకు ఏపీ ఈసీ నోటీసులు

హైదరాబాద్, మార్చి 18 (నమస్తే తెలంగాణ) : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం (ఈసీ) సీఈవో ముఖేశ్‌కుమార్ మీనా నోటీసులు జారీ చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై టీడీపీ సోషల్ మీడియా అభ్యంతరకర పోస్టులు పెట్టిందని వైఎస్సార్సీపీకి చెందిన ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి ఈసీకి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై స్పందించిన సీఈవో ముఖేశ్ కుమార్ మీనా చంద్రబాబుకి నోటీసులు ఇచ్చారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఉన్న అసభ్యకర పోస్టులను 24 గంటల్లోగా తొలిగించాలని సీఈవో ముఖేశ్‌కుమార్ మీనా ఆదేశించారు.

85 ఏండ్లు దాటితే ఇంటి నుంచే ఓటు

మొదటిపేజీ తరువాయి...

వయసు పైబడినవారితోపాటు దివ్యాంగ ఓటర్లకు ఇంటినుంచే ఓటు వేసే సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. రాష్ట్రంలో 85 ఏండ్లు పైబడినవారు 1.94 లక్షల మంది, దివ్యాంగ ఓటర్లు 5.26 లక్షల మంది ఉన్నారని వివరించారు. నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగిసిన నాలుగు రోజుల తరువాత హోం ఓటింగ్ ప్రారంభమవుతుందని, పోలింగ్ సిబ్బంది వచ్చి ఇంటి వద్దనే ఓటింగ్ సౌకర్యం కల్పిస్తారని చెప్పారు. ఏప్రిల్ 15 వరకు కొత్త ఓటర్లుగా నమోదు చేసుకోవచ్చని చెప్పారు.

21.63 కోట్లు సీజ్

ఈ నెల 1 నుంచి ఇప్పటివరకు రూ.21.63 కోట్ల నగదు, వివిధ రకాల వస్తువులను తనిఖీల్లో సీజ్ చేశామని వికాస్‌రాజ్ వివరించారు. అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన నాటి నుంచి ఇప్పటివరకు రూ.243 కోట్ల విలువైన నగదు, ఇతర వస్తువులను సీజ్ చేశామని తెలిపారు. అత్యవసర సర్వీసులు అందించే ఉద్యోగులకు పోస్టల్ ఓటు సౌకర్యం కల్పిస్తున్నామని చెప్పారు.

అధికారులు, ఉద్యోగులకు శిక్షణ

ఎన్నికల నిర్వహణపై ఉన్నతాధికారులకు అందరికీ ఢిల్లీలో, రాష్ట్రస్థాయి అధికారులకు హైదరాబాద్‌లో, ఇతర అధికారులకు జిల్లా స్థాయిలో శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేసినట్టు వికాస్‌రాజ్ తెలిపారు. 1.80 లక్షల మంది

పోలింగ్ సిబ్బంది, మరో 25 వేల మంది ఇతర విధుల్లో పాల్గొంటారని వివరించారు.

కంటోన్మెంట్ ఉపఎన్నికకు ఏర్పాట్లు

కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికకు ఏర్పాట్లు చేస్తున్నామని, రిటర్నింగ్ అధికారిగా కంటోన్మెంట్ బోర్డు సీఈవో వ్యవహరిస్తారని వికాస్‌రాజ్ తెలిపారు. మే 13న జరిగే ఉపఎన్నికకు 500 వరకు బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లు అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. ఇక్కడ 2.51 లక్షల మంది ఓటర్లు ఉన్నారని, 232 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని వివరించారు.

50 వేలకు మించితే ఆధారాలు చూపాలి

ప్రజలు రూ.50 వేల కంటే ఎక్కువ నగదుతో బయటికొస్తే వాటికి సంబంధించిన ఆధారాలు, పత్రాలు వెంట తీసుకోని రావాలని వికాస్‌రాజ్ సూచించారు. రాజకీయ పార్టీలు ఏ రకమైన మీడియాలో ప్రకటనలు ఇచ్చినా వాటికి సంబంధించి ఎంసీఎంసీ ఆమోదం తీసుకోవాలని స్పష్టంచేశారు. ఈ-పేపర్లకు ఇచ్చే ప్రకటనలకు కూడా అనుమతి తీసుకోవాల్సిందేనని స్పష్టంచేశారు. ఎన్నికల్లో అక్రమాలపై సీ విజిల్ యాప్ ద్వారా, లేదా 1950 నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. రాజకీయ పార్టీలు సువిధ యాప్ ద్వారా అనుమతులకు దరఖాస్తు చేయాలని చెప్పారు. రాష్ట్రంలో 9 వేల సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామని చెప్పారు.

రోడ్‌షోలకు స్కూల్ పిల్లలు వద్దు

రాజకీయ పార్టీలు ర్యాలీలు, రోడ్‌షోలు అన్నింటికీ అనుమతి తీసుకోవాల్సిందేనని వికాస్‌రాజ్ స్పష్టం చేశారు. స్కూల్ పిల్లలను రోడ్‌షోలో పాల్గొనకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో అడిషనల్ సీఈవో లోకేశ్‌కుమార్, జాయింట్ సీఈవో సర్ఫరాజ్ అహ్మద్, డిప్యూటీ సీఈవో సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఓటర్లే అధికం

రాష్ట్రంలో 13 నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లు, మరో ఐదు నియోజకవర్గాల్లో పురుష ఓటర్లు అధికంగా ఉన్నారు. ఆదిలాబాద్, పెద్దపల్లి, కరీంనగర్, నిజామాబాద్, జహీరాబాద్, మెదక్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూలు, నల్లగొండ, భువనగిరి, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం నియోజకవర్గాల్లో పురుషుల కంటే మహిళా ఓటర్ల సంఖ్య అధికంగా ఉన్నది. మల్కాజిగిరి, సికింద్రాబాద్, హైదరాబాద్, చేవెళ్ల నియోజకవర్గాల్లో మాత్రం పురుష ఓటర్ల సంఖ్య అధికంగా ఉన్నది.

నియోజకవర్గాలవారీగా ఓటర్ల సంఖ్య

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	థర్డ్ జెండర్	మొత్తం
ఆదిలాబాద్	8,02,010	8,41,827	87	16,43,924
పెద్దపల్లి	7,84,399	8,04,530	101	15,89,030
కరీంనగర్	8,72,192	9,13,514	102	17,85,808
నిజామాబాద్	8,01,253	8,93,448	88	16,94,789
జహీరాబాద్	7,98,915	8,36,124	59	16,35,098
మెదక్	8,97,339	9,20,821	209	18,18,369
మల్కాజిగిరి	19,24,503	18,11,180	533	37,36,216
సికింద్రాబాద్	10,76,104	10,22,120	123	20,98,347
హైదరాబాద్	11,15,712	10,81,623	196	21,97,531
చేవెళ్ల	14,88,326	14,17,612	275	29,06,213
మహబూబ్‌నగర్	8,28,944	8,46,308	40	16,75,292
నాగర్‌కర్నూలు	8,61,980	8,69,803	38	17,31,821
నల్లగొండ	8,41,844	8,76,927	168	17,18,939
భువనగిరి	8,95,184	9,06,057	78	18,01,319
వరంగల్	8,91,969	9,24,250	395	18,16,614
మహబూబాబాద్	7,45,512	7,81,313	104	15,26,929
ఖమ్మం	7,84,041	8,39,677	131	16,23,849
మొత్తం	1,64,10,227	1,65,87,134	2727	3,30,00,088

విస్తీర్ణంలో అతి పెద్ద నియోజకవర్గం:	ఆదిలాబాద్ (12,572 చదరపు కిలోమీటర్లు)
విస్తీర్ణంలో అతి చిన్న నియోజకవర్గం:	హైదరాబాద్ (78.12 చదరపు కిలోమీటర్లు)
ఎక్కువమంది ఓటర్లున్న నియోజకవర్గం:	మల్కాజిగిరి (37,36,216 మంది)
అతి తక్కువ ఓటర్లున్న నియోజకవర్గం:	మహబూబాబాద్ (15,26,929 మంది)

'డీహెచ్‌కు లంచం'పై ఏసీబీ ఫోకస్!

- వైరల్ ఆడియో వివరాలు సేకరించిన అధికారులు
- ప్రత్యేక బృందంతో విచారణ చేపట్టాలని యోచన

హైదరాబాద్, మార్చి 18 (నమస్తే తెలంగాణ): డిప్యూటేషన్ కోసం డైరెక్ట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ (డీహెచ్)కు లంచం ఇచ్చానంటూ వైరల్ అయిన ఆడియోపై ఏసీబీ దృష్టిపెట్టినట్టు తెలిసింది. ఈ అంశంపై ప్రభుత్వం విచారణకు ఆదేశించగా, రిటైర్డ్ ఐఏఎస్‌తో విచారణ జరపాలని వైద్యశాఖ నిర్ణయించినట్టు వార్తలు వస్తున్నాయి. దీనికి అదనంగా ఇప్పుడు ఏసీబీ అధికారులు ఈ ఆడియో వివరాలను సేకరించినట్టు సమాచారం. ఈ ఆడియోలో డీఎంహెచ్‌వో, ఆయన కార్యాలయ సిబ్బంది ప్రస్తావన ఉండటంతో ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి విచారణ జరిపించాలని ఏసీబీ భావిస్తున్నట్టు తెలిసింది. ఒకటి, రెండు రోజుల్లో విచారణ ప్రారంభమయ్యే అవకాశం ఉన్నట్టు అధికార వర్గాలు తెలిపాయి.

నల్లగొండ జిల్లాలో దవాఖాన సూపరింటెండెంట్ రూ.3 లక్షల లంచం తీసుకుంటూ గత నెలలో ఏసీబీకి దొరికిపోయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో డీఎంహెచ్‌వోలు, మెడికల్ కాలేజీలకు అనుసంధానంగా ఉన్న సూపరింటెండెంట్లపై ఏసీబీ ఫుల్ ఫోకస్ పెట్టినట్టు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి.

ఏమీ జరగకుంటే బదిలీలెందుకు?

ఉన్నతాధికారులపై తప్పుడు ఆరోపణలు చేశారనే కారణంతో ఆడియోలో మాట్లాడిన ఉద్యోగినిని డీహెచ్ హుటాహుటిన సస్పెండ్ చేశారు. అయితే ఆఘమేఘాల మీద సస్పెండ్ చేయటం, తదనంతర పరిణామాలను బట్టి.. ఆమె చేసిన ఆరోపణలు వాస్తవం కావొచ్చని వైద్యశాఖ వర్గాలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. సస్పెండ్‌కు ఉద్యోగినికి నోటీసులు ఇవ్వడమో, వివరణ తీసుకొని నిజానిజాలు నిర్ధారణ చేయాలి. కానీ అవేవీ జరగలేదని సమాచారం. మరోవైపు ఇదే ఆడియోలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న మెదక్ డీఎంహెచ్‌వో చందునాయక్‌ను తప్పించారు. ఆయన స్థానంలో డాక్టర్ శ్రీరామ్‌కు బాధ్యతలు అప్పగించారు. ఆ తర్వాత మరో రెండు జిల్లాల డీఎంహెచ్‌వోలను మార్చారు. జనగామ డీఎంహెచ్‌వో ఏసీబీకి చిక్కారు. ఈ నేపథ్యంలో వైద్యశాఖలో జరుగుతున్న దందాలు నిజమేనన్న భావన కలిగిస్తున్నాయని చర్చించుకుంటున్నారు.

నిజాంపేట్ కార్పొరేషన్‌లో ఏసీబీ దాడులు

పట్టుబడిన నిజాంపేట్ ఇన్‌చార్జి ఏసీపీ శ్రీనివాస్‌రావు

దుండిగల్, మార్చి18 : హైదరాబాద్‌లోని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సోమవారం ఏసీబీ దాడులు కలకలం సృష్టించాయి. ఏసీబీ సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్ డీఎస్పీ మాజీద్ అలీఖాన్ తెలిపిన వివరాల ప్రకారం... ఏడాదికాలంగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఇన్‌చార్జి ఏసీపీగా పని చేస్తున్న ఎం శ్రీనివాస్‌రావు ప్రగతినగర్‌లో ఓ చీరెల షాపు హోర్డింగ్‌ను అనుమతి లేదని వారంలో రెండు సార్లు తొలిగించారు. దీంతో దుకాణ యాజమాని గొట్టిపాటి శ్రీనివాసులు నాయుడు మళ్లీ హోర్డింగ్ ఏర్పాటుకు ఏసీపీ శ్రీనివాసరావును అడుగగా, తనకు రూ.1.50 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో శ్రీనివాసనాయుడు ఏసీబీ అధికారులను సంప్రదించాడు. వారి సూచన మేరకు సోమవారం సాయంత్రం ఏసీపీ శ్రీనివాసరావు పంపిన ఓ పార్టీ నాయకుడు రాములునాయక్‌కు డబ్బులు అందజేస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్యాలయంలో రాములు నాయక్, శ్రీనివాస్‌రావును విచారించారు. అనంతరం ఏసీపీ శ్రీనివాస్‌రావును అరెస్ట్ చేశారు. సోదాల్లో సీఐలు ఆకుల శ్రీనివాస్, మల్లికార్జున్, పురందర్‌బట్‌తో పాటు మొత్తం15మంది సిబ్బంది పాల్గొన్నారు.

జూనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

మేడ్చల్ కలెక్టరేట్ : కల్యాణ లక్ష్మి డబ్బుల కోసం లంచం అడిగిన అధికారిని మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ సోమవారం సస్పెండ్ చేశారు. జిల్లాలోని కీసర తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేసే రమేశ్ కల్యాణలక్ష్మి పథకానికి లబ్ధిదారుల నుంచి లంచం అడగినట్లు ఆర్డీవో విచారణలో వెల్లడైంది. దీంతో రమేశ్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

చిత్రం

మలినేనితోనే మళ్లీ?

వరుస హిట్లతో దూసుకుపోతున్నారు నందమూరి బాలకృష్ణ. ప్రస్తుతం ఆయన బాబీ(కె.ఎస్.రవీంద్ర) దర్శకత్వంలో ఓ చిత్రం చేస్తున్న విషయం తెలిసిందే. ఎన్నికల కారణంగా ఈ సినిమా షూటింగ్‌కి బాలకృష్ణ బ్రేక్ ఇచ్చినట్టు తెలుస్తున్నది. ఈ లోపు బాలకృష్ణ లేని సన్నివేశాలతో పాటు పనిలో పనిగా పోస్ట్‌ప్రొడక్షన్ కూడా కానిచ్చేస్తున్నారు చిత్రయూనిట్. ఇదిలావుంటే.. ఈ సినిమా తర్వాత బాలకృష్ణ చేసే సినిమా విషయంలో చాలా వార్తలు వినిపిస్తున్నాయి. 'అఖండ-2' చేస్తారని చాలామంది అంటున్నారు. అయితే.. ఊహించని విధంగా మలినేని గోపీచంద్ కథకే బాలయ్య పచ్చజెండా ఊపేశారని విశ్వసనీయ సమాచారం. వీరిద్దరి కలయికలో వచ్చిన 'వీరసింహారెడ్డి' ఎంతటి విజయాన్ని సాధించిందో తెలిసిందే. ఇటీవల గోపీచంద్ ఓ పవర్‌పుల్ కథ బాలయ్యకు వినిపించారట. ఆ కథ ఆయనకు విపరీతంగా నచ్చడంతో ఓకే అన్నారని తెలిసింది. మైత్రీమూవీ మేకర్స్ వారు ఈ చిత్రాన్ని నిర్మించబోతున్నట్టు తెలుస్తున్నది. ఇంకా ఈ సినిమాకు చెందిన మిగతా వివరాలు తెలియాల్సివుంది.

విరామం లేని ప్రయాణం

మరాఠీ భామ మృణాల్ ఠాకూర్‌ను అదృష్ట నాయికగా అభివర్ణిస్తున్నారు. తొలుత మాతృభాషలో, ఆ తర్వాత హిందీలో సినిమాలు చేసినప్పటికీ ఆశించిన గుర్తింపును సంపాదించుకోలేకపోయిందీ భామ. తెలుగులో అరంగేట్ర చిత్రం 'సీతారామం'తోనే ఈ అమ్మడి దశ తిరిగింది. ప్రస్తుతం మృణాల్ ఠాకూర్ వరుస విజయాలతో దూసుకుపోతున్నది. విజయ్ దేవరకొండ సరసన ఆమె నటించిన 'ఫ్యామిలీ స్టార్' చిత్రం ఏప్రిల్ 5న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా ఇటీవల ఇచ్చిన ఇంటర్వ్యూలో తన కెరీర్‌కు సంబంధించిన పలు ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది మృణాల్. గత రెండేళ్లుగా విరామం లేకుండా పని చేస్తున్నానని, ఒక్కోసారి నిద్రకు కూడా సరైన సమయం ఉండటం లేదని చెప్పింది. 'నా ఫ్యామిలీతో గడపడానికి కూడా సమయం చిక్కడం లేదు. అయితే వర్క్‌లో బిజీగా ఉండటాన్ని ఎంజాయ్ చేస్తున్నా. ప్రతి సినిమాలో నా బెస్ట్ పర్‌ఫార్మెన్స్ ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నా' అని చెప్పుకొచ్చింది. కెరీర్ ఆరంభం నుంచి వైవిధ్యమైన కథలను ఎంచుకొని ప్రయాణం సాగిస్తున్నానని, మంచి పాత్రల ద్వారా ప్రేక్షకుల హృదయాలను గెలుచుకోవాలన్నదే తన అభిమతమని మృణాల్ ఠాకూర్ పేర్కొంది.

నేను కలిసిన గొప్ప వ్యక్తుల్లో రెహమాన్ ఒకరు

సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్‌పై మలయాళ అగ్రనటుడు మోహన్‌లాల్ ప్రశంసల జల్లు కురిపించారు. పృథ్వీరాజ్ సుకుమారన్ హీరోగా బ్లెస్సీ దర్శకత్వంలో తెరకెక్కిన 'ఆడుకాలం' సినిమా ఆడియో వేడుక కేరళలోని కొచ్చిలో ఘనంగా జరిగింది. ఏఆర్ రెహమాన్ ఈ సినిమాకు సంగీతం అందించారు. ఈ కార్యక్రమానికి మోహన్‌లాల్ ముఖ్యఅతిథిగా హాజరై రెహమాన్‌తో తన అనుబంధాన్ని నెమరువేసుకుంటూ అతనిపై ప్రశంసల జల్లు కురిపించారు. 'నటుడిగా నా జీవితంలో అత్యధిక ప్రశంసలందుకున్న సినిమా 'ఇరువర్'. ఇందులోని పాటలు ఇప్పటికీ శ్రోతల్ని అలరిస్తూనేవున్నాయి. 30ఏళ్ల క్రితం వచ్చిన నా 'యోధ' సినిమాకు కూడా తనే సంగీతం అందించారు. ఆ పాటలు వింటుంటే రెహమాన్‌ను చూస్తున్నట్టే ఉంటుంది. అంత గొప్ప సంగీతం ఇచ్చాడు. అంతేకాదు 'ఆరాట్టు' సినిమాలో మేమిద్దరం కలిసి నటించాం. నాకు సంగీత దర్శకుడిగానే కాదు, వ్యక్తిగా కూడా రెహమాన్ అంటే ఇష్టం. నేను కలిసిన గొప్ప వ్యక్తుల్లో రెహమాన్ ఒకరని గర్వంగా చెబుతా. ఆయన తండ్రి ఆర్.కె.శేఖర్‌గారు మలయాళంలో 23 సినిమాలకు సంగీత దర్శకుడిగా పనిచేశారు. దాదాపు 500 సినిమాలకు ఆయన సంగీత దర్శకత్వం వహించారు. ఇప్పుడు రెహమాన్ కూడా మలయాళ సినిమాకు మ్యూజిక్ అందించడం చాలా ఆనందంగా ఉంది' అంటూ కృతజ్ఞతలు తెలిపారు మోహన్‌లాల్. 'ఆడు జీవితం' తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో ఈ నెల 28న విడుదల కానుంది.

వచ్చే ఏడాది పెద్ద సినిమా పక్కా

'పంపిణీదారునిగా కంటే నిర్మాతగా ప్రయాణం బాగుంది. నచ్చిన కథతో ప్రయాణం చేసే వెసులుబాటు నిర్మాతకే ఉంటుంది. అందుకే ఇప్పుడు సంతృప్తిగా ఉన్నాను' అంటున్నారు హాస్య మూవీస్ అధినేత, సక్సెస్‌ఫుల్ నిర్మాత రాజేశ్ దండా. ప్రస్తుతం ఆయన ప్రొడక్షన్ నుంచి అల్లరి నరేశ్ హీరోగా 'బచ్చలమల్లి' సినిమా రానుంది. అలాగే సందీప్‌కిషన్, కిరణ్ అబ్బవరం హీరోలుగా కూడా వీరి సంస్థ నుంచి సినిమాలు రానున్నాయి. నేడు రాజేశ్ దండా పుట్టినరోజు. ఈ సందర్భంగా తన భవిష్యత్ ప్రణాళికల గురించి విలేకరులతో ముచ్చటించారాయన.

- నేను పంపిణీదారునిగా ఉన్నప్పుడే సందీప్‌కిషన్, అల్లరి నరేశ్ నన్ను నమ్మారు. ఇప్పటికీ నాతో ప్రయాణం చేస్తున్నారు. అందుకే వారితో సినిమాలు చేస్తున్నాను. వారిద్దరితో ఇట్లు మారేడుమిల్లి ప్రజానీకం, ఊరుపేరు భైరవకోన చిత్రాలు తీశా. బాగా ఆడాయి. అలాగే నిర్మాతగా నాకు పూర్తి సంతృప్తినిచ్చిన సినిమా 'సామజవరగమన'. ఇవన్నీ హిట్ అవ్వడం నిర్మాతగా నాలో నమ్మకాన్ని పెంచింది.

- నాకు ఇష్టమైన వారితో నా అభిరుచికి తగ్గట్టుగా సినిమాలు చేశా. ఉదాహరణకు 'నాంది'. అది నా జానర్. అలాగే 'బచ్చలమల్లి' కూడా నా జానర్‌లోనే ఉంటుంది. ఇది 90వ దశకంలోని కథ. మే 10నుంచి సాగే సింగిల్ షెడ్యూల్‌తో సినిమా పూర్తవుతుంది.
- పంపిణీదారునిగా అనుభవం నిర్మాతగా బాగా ఉపయోగపడుతున్నది. కథల ఎంపికలో కూడా హెల్ప్ అవుతున్నది. త్వరలో పెద్ద హీరోతో సినిమా చేయబోతున్నాను. స్వతహాగా నేను యాక్షన్ సినిమాల అభిమానిని. రాబోతున్న 'బచ్చలమల్లి'లో కూడా యాక్షన్ మరోస్థాయిలో ఉంటుంది. అందుకే.. కెమెరా, సంగీతం విషయాల్లో పెద్ద స్థాయిలో వెళ్లాను. కథ తర్వాత ముఖ్యమైంది కెమెరా, సంగీతమే కదా. తప్పకుండా వచ్చే ఏడాది పెద్ద సినిమా పక్కా. హీరో ఎవరనేది సస్పెన్స్.

వినూత్న కథాంశంతో 'అహం'

గుండెజారి గల్లంతయ్యిందే, ఒక లైలా కోసం వంటి హిట్ చిత్రాలను అందించిన యువ దర్శకుడు విజయ్ కుమార్ కొండా త్వరలో 'అహం' పేరుతో ఓ చిత్రాన్ని రూపొందించబోతున్నారు. ఈ సినిమా ద్వారా సీనియర్ నిర్మాత కుమారుడు హీరోగా పరిచయం కానున్నాడు. నటుడు శివాజీ నెగెటివ్ ఛాయలున్న పాత్రను పోషించనున్నారని సమాచారం. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రీ పొడక్షన్ వర్క్ జరుగుతున్నది. త్వరలో ఈ చిత్రం సెట్స్‌మీదకు వెళ్లనుంది. ప్రముఖ నిర్మాణ సంస్థ తెరకెక్కించబోతున్న ఈ సినిమా వివరాలను త్వరలో వెల్లడించనున్నారు.

ముక్కాలా ముకాబ్‌లా రిటర్న్స్

30ఏళ్ల క్రితం విడుదలైన ప్రభుదేవ 'ప్రేమికుడు' సినిమా ఓ సంచలనం. శంకర్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాలో ఏఆర్ రెహమాన్ పాటలు, ప్రభుదేవా నృత్యాలు, శంకర్ దర్శకత్వ ప్రతిభ, కథానాయిక నగ్మా అందచందాలు కుర్రకారుని థియేటర్లకు పరుగులు పెట్టించాయి. మహాగాయకుడు స్వర్గీయ ఎస్పీబాలసుబ్రహ్మణ్యం ఇందులో ప్రభుదేవ తండ్రిగా ప్రత్యేక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. తమిళంలో రూపొందిన ఈ చిత్రం తెలుగులో కూడా భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. ఇందులోని పాటలకు ఇప్పటి యువతరం కూడా డ్యాన్సు లేస్తుంటారంటే 'ప్రేమికుడు' కెపాసిటీ అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం రీ రిలీజ్‌ల ట్రెండ్ నడుస్తున్న నేపథ్యంలో 'ప్రేమికుడు' త్వరలో రీ రిలీజ్ కానుంది. రమణ, మురళీధర్ ఈ సినిమాను రీరిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రొడ్యూసర్ కౌన్సిల్ సెక్రటరీ కె.ప్రసన్నకుమార్, కోశాధికారి రామసత్యనారాయణ, దర్శకులు ముప్పలనేని శివ, శివనాగు అతిథులుగా హాజరై రీరిలీజ్ కానున్న 'ప్రేమికుడు' మళ్లీ ఘన విజయం సాధించి నిర్మాతలకు లాభాల పంట పండించాలని అభిలషించారు.

ఎన్నికల నేపథ్య కథ

కన్నడ నటుడు కోమల్ కుమార్ హీరోగా, క్రికెటర్ శ్రీశాంత్ ప్రతినాయకుడి పాత్రలో నటిస్తున్న చిత్రం 'యమధీర'. శంకర్ ఆర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని వేదాల శ్రీనివాసరావు నిర్మించారు. ఈ నెల 23న విడుదలకానుంది. శనివారం ఈ సినిమా ట్రైలర్‌ను ప్రొడ్యూసర్ కౌన్సిల్ సెక్రటరీ ప్రసన్నకుమార్, నిర